క్లుప్తంగా

నేడు అన్నసమారాధన

రాజమహేంద్రవరం రూరల్: మహాశివరాత్రి సందర్భంగా మోరంపూడి జంక్షన్‌లోని సాయి భక్తాంజనేయ తాపేశ్వరం స్వీట్స్ అధినేత వల వల చక్రపాణి, మోహిని దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం మహా అన్నసమారాధన జరుగుతుంది. ఈ మేరకు మోరంపూడి జంక్షన్‌లోని సీవీ రావు గార్డెన్స్‌లో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 25 వేలమంది భక్తులు తరలివస్తారని అంచనా.

శాప్ డైరెక్టర్‌కు పరామర్శ

కడియం: భార్యా వియోగంతో బాధపడుతున్న శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్రను ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు గురువారం పరామర్శించారు. పొట్టిలంకలోని నాగేంద్ర స్వగృహానికి వెళ్లి, ఆయన భార్య శేషారత్నం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వీర్రాజు వెంట వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి సత్యనారాయణ, కొత్తపల్లి సత్య తదితరులు ఉన్నారు.

502 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ సచివాలయం-2 పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్యశిబిరంలో 502 మందికి వైద్యసేవలు అందించారు. ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రిఫరల్ చేశారు. శిబిరాన్ని ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ జి.రోహిత, గైనకాలజిస్ట్ డాక్టర్ మైత్రేయి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ డి.సాంబయ్య రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శేషుకుమారికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శేషుకుమారి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరానికి చెందిన టెర్రస్ గార్డెన్ నిర్వాహకురాలు యర్రా శేషుకుమారి గురువారం హైదరాబాద్‌లో రైతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతునేస్తం మిద్దెతోట పురస్కారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ పురస్కారం ప్రదానం చేశారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక రాజమహేంద్రి మహిళా కళాశాలలో గురువారం ప్రత్యేక సేవా శిబిరం ముగింపు, అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా డిజిటల్ లావాదేవీలపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన దిశ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వాసవి మాట్లాడుతూ ఫోన్ ద్వారా జరిగే ఆర్థిక లావాదేవీలపై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వర రెడ్డి, ప్రిన్సిపల్ తేతలి సత్య సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

12న జాబ్‌ఫెస్ట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో ఈ నెల 12న జాబ్ ఫెస్ట్-2024 నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.రామచంద్రయ్య తెలిపారు. కళాశాలలో గురువారం జరిగిన సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, జేకేసీ కో ఆర్డినేటర్లు, జేకేసీ కమిటీ సభ్యులు పాల్గొని జాబ్ ఫెస్ట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ, ఈ ఫెస్ట్‌లో 25కు పైగా కంపెనీలు పాల్గొంటాయని, 500 పైగా ఉద్యోగాలను భర్తీ చేస్తాయని పేర్కొన్నారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆధర్యాన ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో ఈ జాబ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు.

రూ.35 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ
- రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన



కాతేరులో తాగునీటి పథకాన్ని ప్రారంభించి, మహిళకు బిందె అందిస్తున్న మంత్రి వేణు



బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ శాఖను ప్రారంభిస్తున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత 45 రోజుల్లో రూ.35 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కోలమూరు, కాతేరు, తొర్రేడు, వెంకటనగరం గ్రామాల్లో రూ.4 కోట్లతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. కాతేరులోని శాంతి నగరంలో రూ.53.10 లక్షలతో నిర్మించిన రక్షిత తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ కోలమూరులో రూ.155 లక్షలతో 31 పనులు, కాతేరులో రూ.50 లక్షలతో 10 పనులు, తొర్రేడులో రూ.50 లక్షలతో 10 పనులు, వెంకట నగరంలో రూ.24 లక్షలతో ఏడు పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసబాబు, ఏఈలు సంపత్‌కుమార్, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు అత్తిలి భీమశంకరం, ఆచంట వెంకట సుబ్బారాయుడు, సొసైటీ చైర్‌పర్సన్లు ఆచంట కళ్యాణ్, చిట్టూరి వెంకటరావు, మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు చెరుకూరి సత్యనారాయణ, ఎంఎం ఆలీ, పడాల ప్రసాద్, మద్దాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ శాఖ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: బ్రాహ్మణుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ ప్రయత్నం చేస్తోందని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. బ్రాహ్మణ కోపరేటివ్ సొసైటీ 16వ బ్రాంచ్‌ను నగరంలో గురువారం ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ అమ్మ ప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు మాట్లాడారు. సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి గుళ్లపల్లి నాగసాయి మాట్లాడుతూ 76 వేల మంది సభ్యులు, రూ.32 కోట్ల డిపాజిట్లతో నడుస్తోందన్నారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, సొసైటీ జనరల్ మేనేజర్ అన్నా ప్రగడ కుమారస్వామి, మంగళంపల్లి ఆంజనేయమూర్తి, జిల్లా సహకార అధికారి వై.ఉమామహేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్, రాజమండ్రి నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ పాల్గొన్నారు.

శివరాత్రికి సర్వం సిద్ధం



ఉమామార్కండేయేశ్వరస్వామి ఆలయం

సీటీఆర్ఐ: శంభో శంకర, హరహర మహాదేవా అనే నామస్మరణతో శివాలయాలు మార్మోగనున్నాయి. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాల్లో భక్తుల దర్శనానికి సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. కోటిలింగాలపేట లోని భువనేశ్వరీ సహిత ఉమా కోటిలింగేశ్వరస్వామి, గోదావరి గట్టున ఉన్న ఉమా మార్కండేయేశ్వర స్వామి, సారంగధరేశ్వరస్వామి ఆలయాల్లో, శృంగేరి జగద్గురు శంకరమఠం, శారద పీఠం, క్వారీ మార్కెట్ సెంటర్‌లో గుడి కోరి (గుడి క్వారీ)గా పిలవబడే శివాలయం, జాంపేటలోని ఉమా రామలింగేశ్వర దేవాలయం, గోదావరి ఒడ్డున నూతనంగా నిర్మించిన రోటరీ మహా కాశేశ్వర ఆలయం లో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

గోదావరి ఘాట్లు సిద్ధం

కొవ్వూరులోని గోష్పాద క్షేత్రం, పుష్కరఘాట్, కోటిలింగాల ఘాట్, సరస్వతి ఘాట్, వీఐపీ ఘాట్, గౌతమీ ఘాట్ తదితర చోట్ల రద్దీ బాగా ఎక్కువ ఉంటుంది. ఈ మేరకు అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించారు.

కడియం: వేమగిరి శివాలయం, కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయం, జేగురుపాడు నగరేశ్వరస్వామి, మురమండ, వీరవరం గ్రామాల్లోని సోమేశ్వరాలయాలు, దుళ్లలోని బాలా త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. శుక్రవారం తెల్లవారు జామునుంచే భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేసినట్లు సంబంధిత సిబ్బంది వివరించారు.

టీడీపీ హయాంలో ప్రజాధనం దుర్వినియోగం

- అస్తవ్యస్త డ్రైనేజీలతో ప్రజలకు అవస్థలు
- ధ్వజమెత్తిన ఎంపీ భరత్‌రామ్



టీడీపీ అవినీతిపై మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్



బైబిల్ మిషన్ సభలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: తెలుగుదేశం పార్టీ మేయర్లు, ఎమ్మెల్యేలు ప్రజాధనాన్ని ఎలా దుర్వినియోగం చేశారో చెప్పడానికి జీవీఎస్ అప్పారావు రోడ్డు వీధిలోని మూడు డ్రైనేజీల నిర్మాణం మంచి ఉదాహరణ అని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఆ రోడ్డుకు ఇరువైపులా ఎటువంటి అవగాహనా లేకుండా డ్రైనేజీలు నిర్మించడం వల్ల దాదాపు 15 ఏళ్లుగా స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలు కురిస్తే డ్రైనేజీ నీరంతా ఇళ్లలోకి వచ్చేస్తుందన్నారు. తిలక్ రోడ్డు, బర్మా కాలనీ, ఏవీ అప్పారావు రోడ్డు, పోలీసు క్వార్టర్ల మీదుగా వృథా నీరు ఈ డ్రైనేజీలో వచ్చేదని, అదంతా జీవీఎస్ అప్పారావు రోడ్డులో నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడేవారన్నారు. ఈ ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు ఇక్కడ అండర్ డ్రైనేజీ నిర్మించాల్సి వచ్చిందన్నారు. కింద డ్రైనేజీ, పైన శ్లాబ్ వేసి, మేన్ హోల్స్ పెట్టి ప్రజ సమస్యకు చెక్ పెట్టామన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన డ్రైనేజీలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. అప్పట్లో వారు చేసిన ఇటువంటి పనులపై విజిలెన్స్ విచారణ నిర్వహించాలన్నారు.

ముగిసిన బైబిల్ మిషన్ మహాసభలు

రాజమహేంద్రవరం రూరల్: మార్గాని ఎస్టేట్ గ్రౌండ్స్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బైబిలు మిషన్ 57వ మహాసభలు గురువారంతో ముగిశాయి. ఆనంద్ పాల్, మొదటి వాక్యసందేశం ఇచ్చారు. బైబిలు మిషన్ అధ్యక్షుడు పి.సంజీవరావు మాట్లాడుతూ ప్రేమ, సామరస్యంతో ఎలాంటి సమస్యనైనా జయించగలమని ఉపదేశించారు. ఎంపీ భరత్‌రామ్ ముఖ్యఅతిథిగా హాజరై మూడు రోజుల సభలు విజయవంతంగా నిర్వహించుకున్నందుకు అభినందించారు. దైవజనులకు ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు. ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మార్గాని విజయకృష్ణ శుభాకాంక్షలు అందించారు. సభలకు కన్వీనర్‌గా ఎస్‌జే షారోన్ కుమార్, కో కన్వీనర్‌గా సుదన్ షారోన్, అధ్యక్షుడిగా మార్టిన్ వ్యవహరించారు.

వంటశాలల్లో పరిశుభ్రత పాటించాలి



దుళ్లలో స్వీట్స్‌స్టాల్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కడియం: స్వీట్ స్టాళ్లు, రెస్టారెంట్లలో వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేవీఎస్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ, తూనికలు కొలతలు శాఖలు సంయుక్తంగా కడియం మండలం దుళ్ల గ్రామంలోని నాలుగు స్వీట్ స్టాళ్లలో గురువారం తనిఖీలు చేపట్టాయి. ఫుడ్‌సేఫ్టీ నుంచి అనుమతులు లేకుండా ఆహార పదార్థాలను తయారు చేస్తున్నందుకు దత్త సాయి స్వీట్‌స్టాల్ యజమాని యు.బాల సుబ్రహ్మణ్యం, శ్రీ వెంకటసాయి స్వీట్‌స్టాల్ యజమాని నూలు శ్రీను, శ్రీలక్ష్మీ స్వీట్‌స్టాల్ యజమాని ఈ.నందేశ్వరరావు, సిరి వైభవ స్వీట్స్అండ్ డెయిరీ యజమాని డి.శివకుమార్‌లకు నోటీసులు జారీ చేశారు. అలాగే మైసూర్ పాక్, తొక్కుడు లడ్డూ, పామాయిల్ నూనెల నమూనాలు సేకరించారు. సీల్ వేయని పది కేజీల రాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వంట ప్రదేశాల్లో పరిశుభ్రతను పెంచాలని ఆయా యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. తనిఖీల్లో ఆయా శాఖల సిబ్బంది ముత్యాలు నాయుడు, నాగ వెంకట రాజు, భార్గవ మహేష్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ భరత్‌రామ్‌తోనే నగరాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీను

రాజమహేంద్రవరం సిటీ: ఎంపీ భరత్‌రామ్‌తోనే రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సాధ్యమైందని విశ్వ బ్రాహ్మణ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, వైఎస్సార్ సీపీ నాయకుడు పాదుగు శ్రీను అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ఆశీసులతో నగరంలో అద్భుతమైన అభివృద్ధిని భరత్‌రామ్ చేశారన్నారు. దాన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 15 ఏళ్ల అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు చేయలేని అభివృద్ధిని ఎంపీ భరత్‌రామ్ రెండేళ్లలో చేసి చూపించారన్నారు. నిరంతరం ప్రజల్లో ఆయన వెంటే అన్ని వర్గాలు ఉన్నాయని, ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ఆయన భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ రేగుళ్ల బాల శ్రీధర్, ఈఎస్ఐ డెరెక్టర్ సోడదాసి సుందరసింగ్ పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధిగ్రస్తుల సంక్షేమానికి చర్యలు



లెప్రసీ రోగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ వసుంధర, కొప్పినీడి రామకృష్ణ, విష్ణు

రాజమహేంద్రవరం రూరల్: లెప్రసీ వ్యాధిగ్రస్తులు సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.వసుంధర తెలిపారు. బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో లెప్రసీ వ్యాధిగ్రస్తులకు గురువారం ఆమె ఆధ్వర్యంలో దివ్యాంగుల కార్పొరేషన్ సౌజన్యంతో చంక కర్రలు, వాకర్లు, చేతి కర్రలు, క్లచ్చర్లు పంపిణీ చేశారు. హోమియో వైద్యుడు స్వర్గీయ డాక్టర్ కొప్పిరెడ్డి సుబ్బారావు, స్వర్గీయ సుధ జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రముఖ హోమియో వైద్యుడు కొప్పిరెడ్డి రామకృష్ణ, కొప్పిరెడ్డి విష్ణు.. లెప్రసీ రోగులకు సెల్ఫ్‌కేర్ కిట్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ జగదీష్, డీపీఎంవోలు ఎం.శివకుమార్, జె.వీర్రాజు, ఎం.దేవానందం, ఆర్.ఈశ్వరరావు, విశ్రాంత డీపీఎంవో టీవీ కృష్ణారావు, వివేకానంద మహారోగి ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్ కె.ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు/సీటీఆర్ఐ/కడియం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఆర్యాపురం సాయిరామ్ ఫంక్షన్ హాల్లో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత హాజరయ్యారు. సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయకుమారి పాల్గొన్నారు. అలాగే ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల, ఆర్ట్స్ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. కడియం మండలం వేమగిరి స్కూల్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కడియం హైస్కూల్లో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

కేంద్ర కారాగారంలో నర్సరీ నిర్వహణ



ఒప్పంద పత్రాన్ని చూపిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్, జైలు సూపరింటెండెంట్ రాహుల్

కంబాలచెరువు: నగర సుందరీకరణలో కేంద్ర కారాగారం తనవంతు పాత్ర పోషించనుంది. సుందరీకరణలో భాగంగా పువ్వుల, గ్రౌండ్ కవర్ ఫోలేజ్, ఇండోర్, అవుట్‌డోర్, అవెన్యూ మొక్కలను అందించేందుకు ముందుకు వచ్చింది. ఇందుకోసం కేంద్ర కారాగారంలో జైలు అధికారులు నర్సరీ ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ గురువారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నర్సరీ ఏర్పాటు చేసి, అందులో రకరకాల అందమైన, అలంకార మొక్కలను ఉత్పత్తి చేయనున్నారు. వీటిని రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు అందజేస్తారు.

రిజిస్ట్రేషన్ సేవలను వినియోగించుకోవాలి

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం తపాలా డివిజన్‌లోని 1,085 మంది కేబుల్ ఆపరేటర్లు కొత్త రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పునరుద్ధరణ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ కోరారు. రాజమహేంద్రవరం, రామచంద్రపురం ప్రధాన తపాలా కార్యాలయాల్లో పోస్ట్‌మాస్టర్లకు పత్రాలను సమర్పించి ఈ సేవలు పొందవచ్చన్నారు. గురువారం మొదలైన ఈ కార్యక్రమం ఈ నెల 15వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. వివరాలకు 0883 – 2442338 (రాజమండ్రి), 08857 2422326 (రామచంద్రపురం) నంబర్లను సంప్రదించాలన్నారు.

మైనార్టీ యువతకు ప్రాధాన్యం

ప్రకాశం నగర్: మైనార్టీ యువతకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ ఆరిఫ్ అన్నారు. వక్ఫ్ బోర్డ్ జిల్లా డైరెక్టర్ ఇబ్రహీం ఆధ్వర్యంలో అనపర్తి నియోజకవర్గానికి చెందిన ముస్లిం పెద్దలు ఆయనను గురువారం కలిసి సత్కరించారు.

ముగిసిన హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

ప్రకాశం నగర్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజియేట్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పురుషుల పోటీలు, ఎంపికలు గురువారంతో ముగిశాయి. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులు పాటు నిర్వహించిన ఈ పోటీలకు అంబాసిడర్ ఫర్ జైన్ కల్చర్ రిపబ్లిక్ ఆఫ్ ఉజబెకిస్తాన్ చీమలమర్రి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోటీల్లో ఐడిల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మొదటి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెండు, కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల మూడు, రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నాలుగో స్థానంలో నిలిచాయి. బెస్ట్ ప్లేయర్‌గా డి.జానకిరామ్, బెస్ట్ గోల్ కీపర్‌గా జె.సిద్ధు ప్రతిభ కనబరిచారు. .

పోలీసుల కవాతు

కడియం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని దక్షిణ మండల డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ కోరారు. సుమారు 200 మంది ప్రత్యేక భద్రతాదళ సిబ్బందితో కలిసి గురువారం కడియంలో పోలీసు కవాతు నిర్వహించారు. అంబికా ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, ఎస్సై టి.కృష్ణసాయి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహ పరిరక్షణకు చర్యలు

ప్రకాశం నగర్: పొట్టి శ్రీరాములు విగ్రహ పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు హామీ ఇచ్చారు. రాయల్ మసీదు సలహాదారు అసదుల్లా అహ్మద్ బుధవారం సాయంత్రం రౌతు సూర్యప్రకాశరావును ఆయన కార్యాలయంలో కలిసి ఒక వినతి పత్రం అందజేశారు. కోటగుమ్మం ప్రవేశ ప్రాంతంలో పొట్టి శ్రీరాములు విగ్రహం పడిఉన్న విషయాన్ని వివరించారు. రౌతు మాట్లాడుతూ ఆ విగ్రహాన్ని జెండాపంజా రోడ్డులోని మద్దూరి అన్నపూర్ణయ్య పార్కులో పునఃప్రతిష్ఠ చేయిస్తానని హామీ ఇచ్చారు.

సీఐఎస్ఎఫ్ బలగాలను కలిసిన ఎస్పీ

కంబాలచెరువు: ఎన్నికల నిర్వహణకు జిల్లాకు వచ్చిన సీఐఎస్ఎఫ్ బలగాలను జిల్లా ఎస్పీ పి.జగదీష్ గురువారం కలుసుకున్నారు. వారికి రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గాయత్రి స్కూల్, నిడదవోలు పోలీస్ స్టేషన్ పరిధిలో సెంటెన్స్ స్కూల్లో షెల్టర్ ఏర్పాటు చేశారు. అక్కడి వసతులను ఎస్పీ జగదీష్ పరిశీలించారు.